ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతివృత్తుల వారంతా సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమాన్, రామతీర్థ, రవీందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో మంగళవారం సాయంత్రం దరఖాస్తులు స్వీకరిస్తారని, అర్హులకు రూ.లక్ష రుణం అందజేస్తారన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు(చిరునామాలో తెలంగాణ ఉండాలి), బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న ఫోన్ నంబర్ (ఓటీపీ వస్తుంది) వెంట తీసుకురావాలని సూచించారు.

కండ్లకోయలో బీఆర్‌ఎస్ ఖాళీ



వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కండ్లకోయ బీఆర్‌ఎస్ నాయకులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో బీఆర్‌ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులందరూ కాంగ్రెస్ గూటికి చేరారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు కందాడి నరేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, కర్రోల్ల స్వామి వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి, షమీమ్‌గౌస్‌ఖాన్, రాజేందర్ తదితర 30మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, యాదయ్యమాదిగ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింగ్‌రావు



ఘట్‌కేసర్: జాతీయ మాల మహానాడు తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొర్రెముల్ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావును సోమవారం నియమించారు. మాల సామాజిక వర్గం సంక్షేమానికి చేసిన కృషిని గుర్తించి బాధ్యత అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఓ ప్రకటన విడుదల చేశారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మేడ్చల్: మండలంలోని బండమాదారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. పూడూర్ పరిధిలోని ఈటల నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి, అశోక్‌ముదిరాజ్, ఈశ్వర్, జైపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు వారి అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచయ్య, నాయకులు కృష్ణ, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ ఇంటి యజమానులు ఇంటి పన్ను వడ్డీ 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ రామలింగం ఓ ప్రకటనలో కోరారు. ఇంటి యజమానులు మార్చి 31వ తేదీ లోపు ఇంటి పన్నులు చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలన్నారు. కేవలం 5 రోజులే మిగిలి ఉందని, ఇంటికి వచ్చే ట్యాక్స్ కలెక్షన్ టీం సభ్యులు, ఆన్‌లైన్ ద్వారా నగర పాలక సంస్థ పౌర సేవ కార్యాలయంలో చెల్లించాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

యువతి అదృశ్యం



గాయత్రి (ఫైల్)

మేడ్చల్ రూరల్: అనారోగ్యంతో ఉండటంతో ఆస్పత్రిలో వైద్యం కోసమని తండ్రి వదిలిపెట్టి వెళ్లగా ఆ యువతి అదృశ్యమైంది. మేడ్చల్ ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ మండల రాజీవ్‌గృహకల్పలో నివాసముండే నాగేశ్వర్‌రావు మేడ్చల్ పారిశ్రామికవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22వ తేదీన తన కూతురు గాయత్రి(27) అనారోగ్యంగా ఉండటంతో కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి తీసుకువచ్చి అక్కడే వదిలి వెళ్లాడు. చికిత్స అనంతరం ఆమె ఇంటికి తిరిగి రాలేదు. ఆమెను నగ్న ఫొటోలతో నరేష్ అనే వ్యక్తి వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయత్రి తండ్రి ఫిర్యాదుతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ వెళ్లిన వ్యక్తి..



మణిరత్నం (ఫైల్)

కీసర: వాకింగ్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి మూడు రోజులుగా కనిపించకుండా పోయాడు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం రాంపల్లి రోజ్‌గార్డెన్‌లో నివసించే కార్పెంటర్ ఎస్.లక్ష్మణచారికి ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు మణిరత్నం(32) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అతడికి జవహర్‌నగర్‌కు చెందిన స్వాతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి పిల్లలు లేరు. ఏడాది నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో లక్ష్మణచారి తన పెద్ద కొడుకు, కోడలుకు ఇంట్లో ప్రత్యేకంగా ఓ పోర్షన్ కేటాయించాడు. గత నెల 29న కొడుకు, కోడలు మరోసారి గొడవ పడ్డారు. దీంతో కోడలు పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మణిరత్నం ఈ నెల 23న ఉదయం 6 గంటల ప్రాంతంలో వాకింగ్ వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రంగుల సంబరం

- ఉత్సాహంగా హోలీ వేడుకలు
- సందడి చేసిన యువత





చీర్యాల గ్రామంలో



రాంపల్లిలో..



హోలీ ఆడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్‌లో..



ఎల్లంపేట్‌లో..

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీని మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం కాముడి దహనం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే పెద్దఎత్తున రంగులు చల్లుకుంటూ అన్ని వయసుల వారు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఏ రోడ్డు చూసినా రంగులతో నిండిపోయి కనిపించింది. పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున నృత్యాలు చేశారు.

– మేడ్చల్ జోన్ బృందం



నారపల్లిలో..





పూడూర్ గ్రామంలో..



ఉద్దమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో..



ఘట్‌కేసర్‌లో..



ఘట్‌కేసర్ రాంనగర్‌లో..

మల్కాజ్‌గిరిపై ఎగిరేది బీజేపీ జెండా

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా, మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రవీణ్‌రావు తదితరులు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ గడ్డపై బీజేపీ జెండా ఎగిరేది ఖాయమని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి సమక్షంలో కాచవానిసింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం శామీర్‌పేట్‌లో ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్‌గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రభంజన్, కాచవానిసింగారం అధ్యక్షుడు అశోక్‌ముదిరాజ్, మండల కార్యదర్శి శివరాజ్‌గౌడ్ పాల్గొనగా రామకృష్ణ, రాఘుగౌడ్, సత్యనారాయణ, వినయ్, నవీన్‌యాదవ్, వెంకన్న, మహేశ్, కిరణ్, ప్రశాంత్, ఆకాశ్, రాజు, నవీన్‌ముదిరాజ్ బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు.

నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి అవకాశాలు

అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విష్ణుమూర్తి

ఘట్‌కేసర్: ఆధునిక సాంకేతిక విప్లవానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్, డీన్ విష్ణమూర్తి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఐటీ నియామకాలు–కార్పొరేట్ దృక్పథం'పై సోమవారం ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి అవసమైన నైపుణ్యంపై అవగాహన పెంపొందించేందుకు ప్యానెల్ డిస్కషన్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్, లావణ్య వల్లూరి, జితేంద్ర వంగా, శంకర్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్యానెల్ డిస్కషన్‌లో డీన్ విష్ణుమూర్తి తదితరులు

పొట్లూరి నాగేశ్వరరావుకు ఘన నివాళి



కాప్రా: కార్మికుల హక్కుల సాధన కోసం కార్మిక ఉద్యమ నేత పొట్లూరి నాగేశ్వరరావు పోరాటం మరువలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. పొట్లూరి నాగేశ్వరరావు 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఈసీఐఎల్‌లో సీపీఐ, ఏఐటీయూసీ కాప్రా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న అనేక మంది కార్మికులను ఏకతాటిపైకి తీసుకొచ్చి రాష్ట్ర స్థాయి సంఘాల ఏర్పాటులో నాగేశ్వరరావు పాత్ర కీలకమని తెలిపారు. 1991 నుంచి 1999 వరకు వివిధ రంగాల్లో పనిచేస్తున్న షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు ఇప్పించడంతో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజాసేవలో నిస్వార్థంగా తన జీవితాన్ని కార్మికుల శ్రేయస్సు, హక్కుల సాధనకు ఉద్యమించారని తెలిపారు. సీపీఐ నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, ధర్మేంద్ర, నర్సింహ, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం



25 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక

- యాసంగిలో కొనుగోళ్ల కోసం 12 కేంద్రాలు ఏర్పాటు
- ధాన్యం ఉత్పత్తుల దిగుమతులు 38 వేల మెట్రిక్ టన్నులుగా అంచనా..
- కేంద్రాల్లో రైతులకు అన్నీ వసతులు.. సరిపడా గన్నీ బ్యాగులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యమంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. వచ్చే నెల రెండో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లకు శ్రీకారం చుడుతోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను జిల్లా పౌర సరఫరాల శాఖ ఖరారు చేస్తోంది.

పెరిగిన వరి సాగు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, రైతులు మాత్రం 13,942 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. దీంతో వరి పంట దిగుబడి 38 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ప్రకారం ధాన్యం గ్రేడ్ వన్ క్వింటాల్ ధర రూ.2,203లకు, ధాన్యం కామన్ ధర రూ.2,183లకు ఖరీదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతో సహా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఎండలు మండుతుండటంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతి, షామియానాలు ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 12 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసినా, అదనంగా 1.30 లక్షల గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం(ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి(మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పూరా, పూడూరు(మేడ్చల్ మండలం), శామీర్‌పేట్, అలియాబాద్, కీసర కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంది.

యాసంగి ధాన్యమంతా కొంటాం



రైతులు పండించిన వరి ధాన్యాన్ని 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి మధ్య దళారులను ఆశ్రయించవద్దు. వ్యవసాయ విస్తరణాధికారులు గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తారు. త్వరలో సంబంధిత అధికారులు, రైతు ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తాం. ఏప్రిల్ రెండో వారంలో ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రథమంగా ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తాం. ఆ తర్వాత అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపడతాం.

– జి.రాజేందర్, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈఎంఆర్‌ఐ అమ్మఒడి, అత్యవసర వాహనాలకు డ్రైవర్లు అవసరం ఉన్నారని ఆసక్తి, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్‌జాన్ షాహిద్ తెలిపారు. అమ్మఒడి 102 వాహనాలు, అంతిమ పరమపద వాహనాల్లో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ఫోన్: 95027 65108.

బెల్ట్ షాప్ నిర్వాహకురాలిపై కేసు

ఘట్‌కేసర్: బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న మహిళపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమచారంతో కొండాపూర్‌లోని ఓ ఇంటిలో సోదాలు చేపట్టి రూ.7 వేలు విలువ చేసే 5 ఎంసీ బాటిళ్లు(180ఎంఎల్), 30 కేకే టిన్ విస్కి బాటిళ్లు(180ఎంఎల్) సీజ్ చేశారు. ఈ మేరకు అంజమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



మేడ్చల్: శివరాత్రి నుంచి హోలీ వరకు నిర్వహించే మేడ్చల్ దాక్షాయని సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు(జాతర ఉత్సవాలు) సోమవారంతో ముగిశాయి. హోలీ సందర్భంగా భక్తులు రంగుల్లో మునిగి స్వామివారిని పల్లకిలో ఊరేగించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పండగ సందర్భంగా స్వామి వారికి రంగులు చల్లారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాశీనాథ్, విష్ణుచారి, లక్ష్మణ్, సంజీవ, స్థానిక కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



మేడిపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్‌షాప్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి నిర్వాహకుడిని అరెస్టు చేశారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి సాయిరాం నగర్ కాలనీకి చెందిన బానోతు శివ (38) గత కొద్ది రోజులుగా అక్రమంగా బెల్టు షాపును నిర్వహిస్తూ.. మద్యం విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి బెల్టు షాపుపై దాడి చేసి సుమారుగా 65 లీటర్ల వివిధ రకాల బ్రాండ్ల మద్యం సీసాల కాటన్‌లను స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.